# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- విశాఖను ఆర్ధిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- విశాఖ స్టీల్‌ప్లాంట్ ను ప్రైవేటీకరించమని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖమంత్రి హెచ్.డి.కుమారస్వామి స్పష్టంచేశారు.
- రైతు బజార్లలో రాయితీపై నాణ్యమైన నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియ చేసారు.
- రానున్న వరదల పట్ల అప్రమత్తంగా వుండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర పర్యటన లో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులని పరిశీలించారు. సంబంధిత పనులపై ప్రస్తుత పరిస్తితిని నిర్మాణ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. పాత్రికేయులతో మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం ప్రారంభంలోనే 48లక్షల మంది ప్రయాణికులతో అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఉంటుందనన్నారు. 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశ పూర్తి చేస్తామని ప్రకటించారు. భోగాపురం వరకు బీచ్‌రోడ్ నిర్మాణం కూడా జరగాలని, పారిశ్రామికంగా ఎదిగేందుకు ఈ ప్రాంతానికి మంచి అవకాశాలున్నాయని వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

అనంతరం భారత పరిశ్రమల సమాఖ్య జాతీయ కౌన్సిల్ సమావేశంలో దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. ఉత్పాదక రంగానికి ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక ప్రాంతమని, కొత్త ఆలోచనలతో పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు...సుదీర్ఘ తీర రేఖ, మౌలిక సదుపాయాలతో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అనుకూలమైన ప్రదేశమని,ఇప్పటికే ఫార్మా ఆటోమొబైల్ రంగాల్లో ఎన్నోఅవకాశాలను అందిపుచ్చుకున్నమన్నారు. విశాఖను ఫిన్ టెక్ హబ్ గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా స్పష్టం చేశారు .

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖమంత్రి హెచ్.డి.కుమారస్వామి విశాఖ ఉక్కు కర్మాగారం లో ఈరోజు పర్యటించారు. పరిశ్రమలోని వివిధ విభాగాలను కుమారస్వామితో పాటు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించారు.. స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలను మంత్రులకు ఉన్నతాధికారులు వివరించారు. ఈ సంధర్భంగా నిర్వాసితులు ఇచ్చిన వినతి పత్రాలను మంత్రి స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనే లేదని స్పష్టంచేశారు. ప్రధానమంత్రి అనుమతి తీసుకున్నాక దీనిపై అధికారిక ప్రకటన చేస్తామన్నారు. ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించే బాధ్యత తీసుకుంటామని, అందుకోసమే స్టీల్ ప్లాంట్‌ను నేరుగా సందర్శించి, అధికారులతో సమీక్షించానని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిత్యావసర సరకులను ప్రజలకు రాయితీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతు బజార్లలో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈరోజు విజయవాడ ఏపీఐఐసీ(APIIC) కాలనీలోని రైతు బజార్లో తొలి దుకాణాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులకి మంత్రి పంపిణీ వివరాలు వెల్లడిస్తూ.. సామాన్యులకు నిత్యావసర సరకులను రాయితీపై అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హోల్ సేల్ దుకాణదారులు, రిటైల్ వర్తకులు సైతం 160 రూపాయలకే నాణ్యమైన కిలో కందిపప్పు, తక్కువ ధరకే బియ్యం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. రాబోయే రోజుల్లో పంచదార సహా పలు చిరుధాన్యాలనూ రైతు బజార్ల ద్వారా రాయితీపై పంపిణీ చేస్తామని ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం చొప్పున అందిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గోదావరి, శభరి నదులకు రానున్న వరదల పట్ల అప్రమత్తంగా వుండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈరోజు ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత అధికారులతో నిర్వహించిన దృశ్య మాధ్యమంలో ఆయన మాట్లాడుతూ, వరదలకు సంబంధించి అయిదారు రోజుల ముందుగానే సమాచారం వస్తుందని అవసరమైన సామగ్రిని, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పునరావాస కేంద్రాల ఏర్పాటు, పడవలు, ట్రాక్టర్లు అవసరం, డీజిల్, కిరోసిన్, సోలార్ లైట్లు, తార్పాలిన్లు, దోమతెరలు, మందులు మొదలైన అవసరాలను ముందుగానే అంచనా వేసి సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా వరదలను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక,వాణిజ్య,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయల విడుదల దస్త్రంపై తొలి సంతకం చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడమే తన మొదటి లక్ష్యమని అన్నారు. సామాన్యుల నుంచి వచ్చే ఆదాయం కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సరైన రీతిలో వాడుకున్నట్లయితే ఎంతో ప్రయోజనం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివిధ గ్రామ పంచాయితీలకు మొదటి విడతగా ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు తల్లికి వందనం, స్టూడెంట్ కిట్ ప్రయోజనాలు పొందడానికి ఆధార్ కలిగి ఉండాలని, ఒకవేళ లేకపోతే నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆధార్ వచ్చే వరకు 10 రకాల పత్రాలను పరిగణనలోకి తీసుకుంటామని పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలియజేశారు. ఆధార్ వచ్చే వరకు విద్యార్థుల తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు కార్డు, కిసాన్ పాస్‌బుక్, ఉపాధి పథకం కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు లేదా డ్రైవింగ్ లైసెన్సు, తపాలా పాస్‌బుక్ వ్యక్తిని ధ్రువీకరిస్తూ గెజిటెడ్ అధికారి సంతకం చేసిన పత్రం, తహసీల్దారు ఇచ్చే పత్రం, విభాగం సూచించే ఏ పత్రాన్నైనా అనుమతిస్తామని వెల్లడించారు. కాగా తల్లికి వందనం పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉండి పాఠశాలలకు పిల్లల్ని పంపించే తల్లులు లేదా సంరక్షకులకు సంవత్సరానికి 15 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయనున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందటానికి విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జనాభా నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా వైద్య ఆరోగ్య అధికారులు కృషి చేయాలని పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర రావు అన్నారు. గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా భీమవరం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం నుండి తాహాసిల్దార్ కార్యాలయం వరకు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కరరావు మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి, కుటుంబ నియంత్రణ, పేదరికం గురుంచి సాధారణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాతృ, శిశు శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండేటట్లు అవగాహన కల్పించే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ధవళేశ్వరం ఆనకట్ట వద్ద దిగువకు వరదనీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి వరదల విపత్తులను సమర్థవంతంగా ఎదు ర్కొనేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్లో వరదల విపత్తుల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో వరదలను ఎదుర్కొనేందుకు రూపొందించిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా 2022లో గోదావరి నదికి వచ్చిన వరదలను ఎదుర్కొవడంలో చేపట్టిన సహాయ పునరావాస చర్యల పై ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రామాణిక ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం వరద హెచ్చరికలకి అకనుగుణంగా ఏ ఏ లంక గ్రామాలు ఆవాసాలు ముంపు బారిన పడతాయో ఆ ప్రకారం సహాయ పునరావాస కార్యక్రమాలకు నిర్వహణకు ఉపక్రమించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి ముంపు ప్రభావిత గ్రామాలలో వరద హెచ్చరికలు కనుగుణంగా పంచాయతీ సిబ్బంది ద్వారా దండోరా వేయించి ముంపు బాధిత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =